సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 3 । జూలై । 2025



8 తులాల బంగారం చోరీ

మాధవరం-1 గ్రామంలో ఓ ఇంటిలో 8 తులాల బంగారు, రూ. 30 వేల నగదును దొంగలు చోరీ చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. -8లో



పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

పీఎం సూర్యఘర్ యోజనను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ జానకీ రామ్ పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.430
రెండోరకం	రూ.220	రూ.350

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1007 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రైవేటు పాఠశాలలు మూత

రాజంపేట రూరల్: ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యంపై ఫీల్డ్ అధికారులు పంపిస్తున్న సందేశాలు, హెచ్చరికలు వంటి చర్యలకు ప్రతిస్పందనగా గురువారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయనున్నట్లు అపుస్మా జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి వేంకటేశ్వర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రైవేట్ పాఠశాలల పై ఫీల్డ్ అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష చర్యలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణకు ఏదైనా అంతరాయం ఏర్పడితే అది 10 వేల మంది యాజమాన్యాలను ప్రభావితం చేస్తుందన్నారు. అదే విధంగా 3లక్షల మంది సిబ్బందిని, 40 లక్షల మంది విద్యార్థులను కూడా ప్రభావితం చేస్తుందని హెచ్చరించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే వారే దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు.

తాళ్లపాక చెన్నకేశవస్వామికి గరుడ వాహనం



శ్రీ చెన్నకేశవస్వామికి గరుడవాహనంను అందచేస్తున్న సర్పంచ్ గౌరీశంకర్ దంపతులు

రాజంపేట: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామికి సర్పంచ్ శ్యామనబోయిన గౌరీశంకర్, నాగమణి దంపతులు గరుడ వాహనంను అందచేశారు. బుధవారం అన్నమయ్య ధ్యానమందిరం ఆవరణలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీకి గరుడ వాహనం తయారుచేయించి అప్పగించారు. ఈ సందర్భంగా తాళ్లపాక సర్పంచ్ మాట్లాడుతూ శ్రీ చెన్నకేశవస్వామిని తాళ్లపాక అన్నమాచార్యులు పూజించి, ఆరాధించారన్నారు. అటువంటి స్వామికి తాము గరుడ వాహనం చేయించి ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, టీటీడీ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గాలివీడు: కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కోసం ఆర్డీఓ శ్రీనివాసులు స్థలాన్ని పరిశీలించారు. బుధవారం మండలంలోని తూముకుంట గ్రామంలో తహసీల్దార్ భాగ్యలతతో కలసి అనువైన స్థలం కోసం ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ సహకారంతో 100 ఎకరాల్లో బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటులో భాగంగా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సేంద్రియ వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ వంటి వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ భవానీ శంకర్, మండల సర్వేయర్ మురళీ, హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి విత్తనాలు కొనుగోలు చేయవద్దు



వరినాట్లు వేస్తున్న రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఒంటిమిట్ట: వరి సాగు చేసేందుకు దళారులను నమ్మి వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదని, అలా చేస్తే ప్రభుత్వం రైతులకు జవాబుదారితనంగా ఉండదని కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ తెలియజేశారు. బుధవారం మండలంలోని చెర్లోపల్లి, నడింపల్లి గ్రామ పొలాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వరినాటు వేసే ప్రతి రైతు నారు కొనలు తుంచి నాటాలని, దీనివలన కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించవచ్చని, అలాగే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము వేసి దుక్కిలో కలియదున్నడం వలన మొక్కలకు పోషకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, వీఏఏ చంద్రమోహన్, వీహెచ్ఏ ప్రియదర్శిని, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెరువుల్లో ఇసుక తోడేళ్లు

- జేసీబీలతో ఇష్టారాజ్యంగా తోడేసున్న వైనం
- యథేచ్ఛగా బయట ప్రాంతాలకు తరలించి ఆ సొమ్ము జేబుల్లోకి..



కొత్తపల్లె చెరువులో జేసీబీతో ఇసుకను తోడి ట్రాక్టర్లకు నింపుతున్న దృశ్యం



రామానాయిని చెరువులో పట్టపగలే ఇసుక అక్రమ రవాణా చేపట్టిన దృశ్యం

గుర్రంకొండ: ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది జేసీబీలతో ఇష్టానుసారంగా ఇసుకను తోడేస్తూ బయటి ప్రాంతాలకు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. మండలంలోని తరిగొండ, మర్రిపాడుతో పాటు పెద్ద పెద్ద ఇరిగేషన్ చెరువుల్లో జేసీబీలతో ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేసి అక్రమంగా తరలించుకుపోతున్నారు. చెరువుల్లో జేసీబీ, ఇసుక ట్రాక్టర్లతో నిండిపోయి జాతరను తలపిస్తోంది. ఇంతజరుగుతున్నా అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి.

జేసీబీలతో తవ్వకాలు: మండలంలోని తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లోని రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువులు అతిపెద్ద ఇరిగేషన్ చెరువులు. వందలాది ఎకరాల్లో ఈరెండు చెరువులు విస్తరించి ఉన్నాయి. వీటితో పాటు అమిలేపల్లె, ఎం.కొత్తపల్లె చెరువుల్లో ఇసుక నిల్వలు భారీగా ఉండడంతో ఇసుకాసురుల కళ్లు వీటిపై పడ్డాయి. రోజుల తరబడి జేసీబీలతో చెరువుల్లోని ఇసుకను తోడేస్తున్నారు. ఒక జేసీబీ నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని ఇసుకను ఇష్టానుసారంగా తరలించేస్తున్నారు. చెరువుల్లో ముందుగా పైన మట్టిని జేసీబీలతో తవ్వకాలు చేపడుతున్నారు. పైన ఉన్న రెండునుంచి నాలుగు అడుగుల మేరకు ఉన్న మట్టిని తొలగించేస్తున్నారు. తవ్వేసిన మట్టిని ట్రాక్టర్ల ద్వారా ఇటుకబట్టీల కు తరలించి విక్రయించేస్తున్నారు. ఆ తరువాత టన్నుల కొద్దీ ఇసుక నిల్వలు చెరువుల్లో బయటపడుతున్నాయి. పట్టపగలే జేసీబీలతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించేస్తున్నారు. జేసీబీలతో చెరువుల్లో తవ్విన గోతులు 15 నుంచి 20 అడుగుల లోతు వరకు ఉండి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.

పక్క మండలాలకు తరలుతున్న ఇసుక: మండలంలోని మర్రిపాడు, తరిగొండ, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, బోడిగుట్ట సమీప చెరువుల్లో ఇసుక దోపిడి యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది వ్యక్తులు చెరువులను ఆక్రమించేశారు. వీటిలో టన్నుల కొద్దీ ఇసుకను బహిరంగంగా టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. ఇసుకను పగలు, రాత్రి తేడా లేకుండా బయట మండలాలకు తరలించేస్తున్నారు. పక్కనే ఉన్న వాల్మీకిపురం, కురుబలకోట, పెద్దమండ్యం మండలాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను బయట ప్రాంతాల్లో రూ. 3వేలు నుంచి రూ.3300వరకు విక్రయిస్తున్నారు. స్థానికంగా ఉన్న కొంతమంది నేతలు ఇళ్ల నిర్మాణాల నిమిత్తం ఇసుకను తరలిస్తున్నామని చెప్పుకొంటూ రాత్రిళ్లు ఇష్టానుసారంగా బయట ప్రాంతాలకు తరలించేస్తున్నారు.

గ్రామస్తులకు ఇసుకాసురులకు మధ్య ఘర్షణ: రామానాయిని చెరువులో ప్రతిరోజు ఇసుకను అక్రమంగా తరలించుకు పోతుండడంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అడ్డుకొని వాగ్వివాదానికి దిగిన సంఘటనలు ఇటీవల చోటు చేసుకొన్నాయి. అధికారులు ఎంత మాత్రం పట్టించుకోకపోయినా ఇంత విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తారా అంటూ గ్రామస్తులు ఇసుకాసురులను అడ్డుకోవడంతో ఘర్షణ పడ్డారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా అక్రమ రవాణా సాగిస్తూనే ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ పనుల సాకుతో...

ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన అభివృద్ధి పనుల నిర్మాణాల కోసం అనే సాకుతో ఇసుకాసురులు ఇష్టానుసారంగా ఇసుకను విక్రయించుకొంటున్నారు. మండలంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిని సాకుగా చూపించి రోజుల తరబడి ఇసుకను చెరువుల్లో అక్రమంగా తోడేస్తూ కొంతమంది లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నారు. గృహ అవసరాల కోసం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే జేసీబీలతో తోడేయమని ఎక్కడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయినా ఇవేవీ తమకు పట్టవంటూ కొంత మంది నేతలు ఇసును జేసీబీలతో రాత్రింబవళ్లు తోడేస్తూ ఉన్నారు. ఇసుక విషయమై అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నేతలు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. స్వయంగా అధికార పార్టీ నేతలే అధికారులకు ఫిర్యాదు చేసే స్థాయికి వచ్చారంటే ఏస్థాయిలో ఇసుక అక్రమరవాణా జరుగుతోందో తేటతెల్లమవుతోంది.



రామానాయిని చెరువులో ఇసుక తోడేయడంతో చెరువులో పెద్ద ఎత్తున ఏర్పడిన గొయ్యి

చర్యలు చేపట్టినా ఫలితం శూన్యం

ఇసుక అక్రమరవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నా ఫలితాలు మాత్రం శూన్యంగా మిగిలాయి. గతంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా జేసీబీలతో చెరువుల్లో ఇసుకను తరలించే మార్గాల్లో పెద్ద ఎత్తున గుంతలు తవ్వించారు. కొద్దిరోజుల పాటు స్థానిక రెవెన్యూ అధికారులు చెరువుల వద్ద హడావిడి చేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టామంటూ ప్రచారం చేసుకొన్నారు. పోలీసులు రెండు రోజుల పాటు చెరువుల వద్ద కాపలాగా ఉన్నారు. అయితే ఇవేవీ పట్టనట్లు ఇసుకాసురులు మూడవ రోజు నుంచి షరా మామూలే అన్న చందంగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇసుకను ఏదో ఒక మార్గంలో అక్రమంగా తరలించుకుపోతూ ఇటు పోలీసులకు, అటు రెవెన్యూ అధికారులకు ఇసుకాసురులు సవాల్ విసురుతున్నారు.

నాయకులు మాట వినడం లేదు

రామానాయిని చెరువులో గత కొన్ని నెలలుగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఇలాంటి పనులు చేయవద్దని నాయకులకు ఎన్నోమార్లు చెప్పాము. అయినా మా మాటల్ని పెడచెవిన పెట్టి ఇసుకను తరలించుకుపోతున్నారు. కొంత మంది నాయకులు వర్గాలుగా విడిపోయి ఈ వ్యాపారం చేసుకొంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఒకరిపై ఒకరు సాకులు చెపుతున్నారు. – వెంకటరమణ, వీఆర్వో, తరిగొండ

గట్టి నిఘా చర్యలు చేపడతాం

మండలంలోని రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువుల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. గతంలో కొద్దిరోజుల పాటు చెరువుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకమీదట చెరువుల వద్ద ఇసుక అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేసి చట్టపరంగా చర్యలు చేపడతాం. – రఘురామ్, ఎస్ఐ, గుర్రంకొండ

లక్ష్యాలను సాధించేలా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి: రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, రాయచోటి ఆర్డీఓ, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి వికసిత్ భారత్-2047 తీసుకొస్తే దానికి అనుబంధంగా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పనకు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, నియోజకవర్గ మండలాల తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు సిద్ధం చేయండి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై నిర్దేశించిన లక్ష్యాల ప్రగతి సాధనపై నివేదికలు సిద్ధం చేసి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఆయన మాట్లాడారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్వహించే వీడియో కాన్ఫరెన్సుకు సంబంధించిన అంశాలపై నివేదికలతో హాజరు కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రస్థాయిలో అన్నమయ్య జిల్లాను మెరుగైన స్థానంలో నిలిచేటట్లు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ మధుసూదన్ రావు, డీపీఓ, సీపీఓ, ఐసీడీఎస్ పీడీ, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ, డీఎంహెచ్ఓ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ల్యాండ్ అక్విటేషన్ సూపరింటెండెంట్, జిల్లా వ్యవసాయ అధికారి, ఏపీఎస్ఆర్టీసీ డీఎం, రాయచోటి మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో అలజడి

- పోలీస్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల ఇళ్లలో సోదాలు
- భారీగా పేలుడు పదార్థాల సామగ్రి, సాంకేతిక పరికరాలు, ఉగ్రవాదుల సమాచారం లభ్యం
- ఉగ్రవాదుల గృహాలను సీజ్ చేసిన పోలీసులు
- ఎస్పీ అదుపులో ఉగ్రవాదుల కుటుంబసభ్యులు



ఉగ్రవాదులు నివసిస్తున్న గృహం ఇదే

రాయచోటి: ఉగ్రవాదుల అరెస్టుతో అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో అలజడి నెలకొంది. కొన్ని దశాబ్దాలుగా ఉగ్రవాదులకు రాయచోటి పట్టణం షెల్టర్ జోన్‌గా ఉండటంపై ఇటు పోలీసులు, అటు ప్రజలలో టెన్షన్ వాతావరణం నెలకొంది. చెన్నై, కర్ణాటక, కేరళ, హైదరాబాద్ రాష్ట్రాలలోని పలు ప్రాంతాలలో చేపట్టిన బాంబు బ్లాస్టింగ్ సంఘటనలలో రాయచోటిలో పట్టుబడిన ఇరువురి పాత్ర ఉందన్న సమాచారంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. కొన్ని నెలలుగా రాయచోటిలోనే మకాం వేసిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు ఉగ్రవాదుల జాడ కనిపెట్టడంలో సఫలీకృతులయ్యారు. కాశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదులు జరిపిన ఘోర దుర్ఘటన సమయంలో వీరిద్దరి కదలికలు అధికం కావడంపై ఐబీ అధికారులు అలర్ట్ అయినట్లు సమాచారం. ఐబీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేక సిబ్బంది ద్వారా వారిద్దరినీ అదుపులోకి తీసుకొన్నారు. కేరళ ప్రాంతానికి చెందిన వీరిద్దరూ రాయచోటిలో స్థిర నివాసం ఏర్పరచుకొని ఇక్కడి నుంచి ఇతర ఉగ్రవాదులతో సంబంధాలను కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. ఎవరికీ అనుమానం రానివ్వకుండా 30 ఏళ్లుగా రాయచోటిలో జీవనం సాగించడంపై పట్టణంలో మరి ఎంతమంది ఉగ్రవాదులు ఉన్నారో అన్న భయం పట్టణవాసుల్లో నెలకొంది. పట్టుబడిన ఇద్దరినీ ఐబీ అధికారులు చెన్నైకి తరలించిన అనంతరం జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాలతో రెవెన్యూ అధికారులను కలుపుకొని ఉగ్రవాదుల గృహాలలో సోదాలు చేశారు. విస్తుపోయే ఆధారాలు లభించినట్లు తెలిసింది. పట్టణ పరిధిలోని కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో నివాసం ఉన్న షేక్ అమానుల్లా(55) అలియాస్ అబూబకర్ సిద్దిక్, మహబూబ్‌బాషావీధిలో నివాసం ఉన్న షేక్ మన్సూర్ (47) అలియాస్ మహమ్మద్‌అలీలు సొంతంగా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. వీరి గృహాలలో బ్లాస్టింగ్ పరికరాలు, కేబుల్స్, నెట్‌వర్క్ సమాచారం చేరవేసే యంత్రాలు, మ్యాపులు, భూముల కొనుగోలుకు సంబంధించిన రికార్డులు తదితర వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1995లో కోయంబత్తూర్‌లో జరిగిన బాంబు పేలుళ్ల కేసులో ప్రధాన నిందితులుగా ఉన్నారు. అలాగే బీజేపీ దివంగత అగ్రనేత ఎల్‌కె అద్వానీ రథయాత్ర సందర్భంగా విధ్వంస చర్యలకు కుట్రలు చేసినట్లు వారి మీద ఆరోపణలు ఉన్నాయి. అలాగే దేశంలో జరిగిన వివిధ ఉగ్రవాద కార్యకలాపాలలో వీరి ప్రమేయం ఉన్నట్లుగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆధారాలు లభ్యం: ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇరువురి అరెస్టు అనంతరం వారి గృహాల్లో పోలీసులు మంగళవారం నుంచి బుధవారం సాయంత్రం వరకు అణవణువునూ శోధించారు. కీలక సమాచారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ రెండు గృహాలను సీజ్ చేశారు.

వివాహాలపై..

ఒకవైపు ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు రచిస్తూనే మరోవైపు ఎవరికి అనుమానం రానివ్వకుండా ఇద్దరు ఉగ్రవాదులు సంసార సాగరంలో కొనసాగారు. అబూబకర్ గాలివీడు మండల పరిధిలో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె జన్మించి అనారోగ్యంతో మృతిచెందింది. మహమ్మద్‌అలీ పట్టణంలోని బిరాంసాహెబ్‌వీధికి చెందిన మహిళతో వివాహమైంది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. వీరి వివాహానికి, ఇతర కార్యకలాపాలకు సహకరించిన వారి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే తీవ్రవాదుల భార్యలను, వారి బంధువులను అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు వీరికి అన్ని రంగాలలో సహకరిస్తున్న మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నిఘా నీడలో రాయచోటి..

దేశంలోనే వివిధ ప్రాంతాలలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేయడంతో జిల్లా ఎస్పీ రాయచోటిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. పట్టణంలోకి ప్రవేశిస్తున్న వాహనాలతో పాటు, వివిధ అంశాలపై నిఘాను కట్టుదిట్టం చేశారు.

లైనింగ్ పనుల్లో ఉల్లంఘనలు ?

- మట్టి కాలువపైనా షార్ట్ క్రీటింగ్‌పై ఆరా
- షార్ట్ క్రీటింగ్ అవసరమైన మేరకే చేయాలని సూచన
- పీబీసీ, కేబీసీలో పనులపై ముగిసిన క్వాలిటీ కంట్రోల్ సీఈ విచారణ
- ఇచ్చే నివేదికలో ఏముంటుందోనని అధికారుల్లో టెన్షన్



పుంగనూరు ఉపకాలువ ఇరువైపులా బండరాళ్లపై జరిగిన షార్ట్ క్రీటింగ్ పనులు

మదనపల్లె: హంద్రీ – నీవా ప్రాజెక్టులో భాగమైన జిల్లాలోని పుంగనూరు ఉపకాలువ (పీబీసీ), చిత్తూరు జిల్లాలోని కుప్పం ఉపకాలువ (కేబీసీ)లో చేపట్టిన లైనింగ్ పనుల నాణ్యత, నిబంధనల ఉల్లంఘనలపై ఈస్ట్‌కోస్ట్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ శేషుబాబు మూడు రోజుల పర్యటన బుధవారం సాయంత్రం ముగిసింది. రూ.169 కోట్లతో కేబీసీ, రూ.366 కోట్లతో పీబీసీలో లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనులను కాంట్రాక్టు సంస్థలు చేపట్టాయి. కూటమి ప్రభుత్వంలో పనులెలా చేసినా తమను ప్రశ్నించే వారే లేరన్న ధీమాతో ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంపై క్వాలిటీ కంట్రోల్ సీఈ సోమవారం జిల్లాలోని పీబీసీలో జరిగిన పనులపై మొదలు పెట్టిన పరిశీలన..మంగళవారం కేబీసీ రీచ్-1లో, బుధవారం కేబీసీ రీచ్-2లో జరిగిన లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనులను పరిశీలించి తనిఖీలు చేశారు. దీనిపై ఆయన స్వయంగా చేసుకున్న పరిశీలన సందర్భంగా ప్రాజెక్టు అధికారుల వద్ద, పరిశీలన సమయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా పరిశీలన పూర్తి చేయడంపై ప్రాజెక్టు అధికారుల్లో గుబులు రేపుతోంది. ఇంతకీ సీఈ ఏం పరిశీలనలో కనిపించిన అంశాలపై స్థానిక అధికారులతో చర్చించలేదని తెలిసింది. ఆయన మాటల్లో కొన్ని అంశాలపై చేసిన సూచనలే పెద్ద ఉల్లంఘనలుగా భావిస్తున్నారు.

మట్టికి షార్ట్ క్రీటింగ్ ఎందుకు?

లైనింగ్ పనుల్లో మట్టికాలువపై చేసే లైనింగ్ పనికి చెల్లించే సొమ్ము కంటే షార్ట్ క్రీటింగ్‌కు చెల్లించే ధర ఎక్కువ. దీన్ని అడ్డుపెట్టుకుని కాంట్రాక్టు సంస్థలు మట్టి కాలువపైనా షార్ట్ క్రీటింగ్ చేయడాన్ని గుర్తించి ఈ అంశాన్ని లేవనెత్తి అధికారులను ప్రశ్నించారని అధికార వర్గాలు చెప్పాయి. మట్టికాలువకు షార్ట్ క్రీటింగ్ చేసి అధిక మొత్తంలో ధర పొందడమే కాకుండా ఒప్పందానికి మించి బిల్లు పొందవచ్చని కాంట్రాక్టు సంస్థలు ఈ ఎత్తుగడ వేశారని అంటున్నారు. దీన్ని సీఈ పసిగట్టడంతో ఇకపై ఎలా ముందుకు వెళ్తారన్న దానిపై చూడాల్సి ఉంది. ఈ పరిస్థితి పరిశీలించాక షార్ట్ క్రీటింగ్ పనులు అవసరమైన మేరకే చేయించడం , ఆపై అనవసరంగా వద్దు అని సూచన చేశారని తెలిసింది. రెండు కాలువల్లోనూ పరిశీలించిన అంశాలల్లో కాంట్రాక్టు సంస్థల ఉల్లంఘనలు ఉన్నట్టు తేలిందని సమాచారం.

నివేదికపై అధికారుల్లో గుబులు

గత టీడీపీ ప్రభుత్వంలో కుప్పం ఉపకాలువ, ఇతర ప్రాజెక్టు పనుల్లో ఇష్టారీతిన పనులు చేసిన కాంట్రాక్టు సంస్థలు అదనపు పని పేరుతో రూ.122 కోట్ల దోచుకున్నారు. కొద్ది పాటి పనులకు కోట్లలో అంచనాలు పెంచుకుని యథేచ్ఛగా దోపిడీపర్వం సాగించారు. ఈ పరిస్థితులను మళ్లీ పునరావృత్తం చేసి షార్ట్ క్రీటింగ్ పని పెరిగిందని, ఒప్పందం కంటే అధిక వ్యయభారం, పనులకు ఆటంకాలు అన్న కారణాలను చూపి ఒప్పంద వ్యయాన్ని పెంచుకునే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో సీఈ శేషుబాబు ఇచ్చే నివేదికలో పొందుపరిచే అంశాలపై అధికారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. లైనింగ్ పనుల్లో ఉల్లంఘనలు నిజమేనని తేలిన కారణంగా వాస్తవ పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తారని భావిస్తున్నప్పటికి అధికారులను కాపాడేందుకు నివేదికను మార్చడం లేదా తొక్కిపెట్టే ప్రయత్నాలు జరగవచ్చని అంటున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు





గాయపడిన క్రిష్టారెడ్డి, నాగులమ్మ, భాస్కర్‌రెడ్డి

సంబేపల్లె : చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై మోటకట్ల శివాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని వంగమళ్లవాండ్ల పల్లెకు చెందిన క్రిష్టారెడ్డి, భార్య నాగులమ్మలు స్కూటీలో మోటకట్ల సమీంలోని కుండల షాపు వద్దకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మోటకట్ల శివాలయం సమీపంలోకి రాగానే సంబేపల్లె వైపు నుంచి బైకుపై వస్తున్న భాస్కర్ రెడ్డి అదుపు తప్పి భార్యాభర్తలు వెళుతున్న స్కూటీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు భాస్కర్‌రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు

కలికిరి(వాల్మీకిపురం) : రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని రోజుల్లోనే రాజకీయ ఒత్తిళ్లతో అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన సంఘమిత్రలు నల్లంకి సుమలత(వి.ఒ.-6), నల్లంకి రేఖ(వి.ఒ-1) లను డీఆర్‌డీఏ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులుగానీ, సమాచారం ఇవ్వకుండా విధులనుంచి తొలగించారు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. వీరి వినతిని పరిశీలించిన హైకోర్టు తొలగించిన సంఘమిత్రలను విధుల్లోకి తీసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయినా డీఆర్‌డీఏ అధికారులు హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ తొలగించిన సంఘ మిత్రలను విధుల్లోకి తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. తమకు న్యాయం జరగక పోవడంతో బాధిత సంఘమిత్రలు తిరిగి కోర్టు ధిక్కారంపై హైకోర్టును ఆశ్రయించి న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.

లైసెన్స్ ఉన్న షాపుల వద్దే మద్యం కొనుగోలు చేయాలి

రాయచోటి టౌన్ : లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం షాపు వద్ద మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రాయచోటి సీఐ గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు, పార్టీలు, ఇతర వేడుకలకు తాము మద్యం తగ్గింపు ధరలకే సరఫరా చేస్తామని మోసం చేసే వారున్నారన్నారు. అలాంటి వారు నకిలీ మద్యం విక్రయిస్తారన్నారు. అలాంటి మద్యం సేవించడం వలన ఆరోగ్యాలు పాడవడంతో పాటు కొన్ని సందర్భాలలో ప్రాణాలు కూడా కోల్పోతారని చెప్పారు. అలాంటి అనుమానిత వ్యక్తుల వివరాలను టోల్ ఫ్రీ నంబర్ 14405కు కానీ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నంబర్ 7981216391కు ఫోన్ తెలియజేయాలని కోరారు.

బతకాలనే ఆశ ఉంది.. అధిక వడ్డీలు చెల్లించలేక చనిపోతున్నా!

- సెల్ఫీ సూసైడ్ వీడియోలో రియల్టర్ రాజేంద్ర
- అప్పుల భారం అధికమై ఆత్మహత్య
- మదనపల్లెలో అధికమవుతున్న కాల్ విష నాగులు



బొజ్జా రాజేంద్ర(ఫైల్)

మదనపల్లె రూరల్ : 'సమాజంలో గౌరవంగా బతకాలని చాలా కోరికగా ఉంది. అప్పుల వాళ్లు ప్రాణం తీసేస్తున్నారు. గంట గంటకు టెన్షన్. నిద్రపోయి చాలా రోజులైంది. ఆరోగ్యం బాగోలేదు. దేనికీ పనికి రాకుండా అయిపోయాను. వడ్డీలకు వడ్డీలు, అధిక వడ్డీలు కట్టలేకపోతున్నాను. అందరి దగ్గర నీచమైన మాటలు అనిపించుకుంటున్నాను. విధిలేని పరిస్థితుల్లో చచ్చిపోతున్నా'... భార్య, బిడ్డ నన్ను క్షమించండంటూ రియల్టర్ రాజేంద్రబాబు చివరిగా సెల్‌ఫోన్‌లో సెల్ఫీ సూసైడ్ వీడియో తీసుకుని తనువు చాలించాడు. మదనపల్లెలో కొద్దిరోజుల క్రితం వెలుగు చూసిన కాల్‌మనీ వ్యవహారం సద్దుమణగక ముందే పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అప్పులబాధ తాళలేక, అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడటం సంచలనం కలిగించింది. పట్టణంలోని అమ్మినేనివీధికి చెందిన బొజ్జ రాజేంద్ర(55) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఇతనికి అమ్మినేనివీధి, కృష్ణానగర్‌లో రెండు సొంత ఇళ్లు ఉన్నాయి. కృష్ణానగర్‌లోని ఇంటి కింది భాగంలో రెండు వార్డు సచివాలయాలకు అద్దెకు ఇచ్చి, పై భాగంలోని ఇంటిలో రియల్ ఎస్టేట్ ఆఫీసు నిర్వహిస్తున్నాడు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా పట్టణానికి చెందిన పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు. ఇటీవల కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవడం, వ్యాపార లావాదేవీలు పూర్తిగా స్తంభించడంతో అప్పుల వాళ్లకు చెల్లింపులు చేయలేకపోయాడు. పరువు, ప్రతిష్టలు కాపాడుకునేందుకు వడ్డీలు చెల్లించేందుకు అధిక వడ్డీకి కొత్త అప్పులు తీసుకోవడం, వాటికి వడ్డీలు చెల్లించలేక, ఇచ్చిన వారు ఇంటివద్దకు వచ్చి నిలదీస్తుంటే తట్టుకోలేకపోయాడు. బజారులో అందరి ముందు తక్కువచేసి మాట్లాడటం, తన గురించి చెడు ప్రచారం చేస్తుండటంతో విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. గతంలోనూ ఆత్మహత్యకు ప్రయత్నించి, చివరి నిమిషంలో ప్రాణాలు దక్కించుకున్నాడు. ఆ తర్వాత కొద్ది రోజులు బాగానే ఉన్నప్పటికీ, ఇటీవల అప్పుల వాళ్ల వేధింపులు అధికమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం కృష్ణానగర్‌లోని కార్యాలయంలో సెల్ఫీ సూసైడ్ వీడియో తీసుకున్న తర్వాత రూములోని ఫ్యాన్ కొక్కీకి తాడు తగిలించి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, మృతుడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బొజ్జా రాజేంద్రకు భార్య లత, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమార్తె రిషిత ఉన్నారు.

అధికమవుతున్న వడ్డీ వ్యాపారుల వేధింపులు..

పట్టణంలో మధ్యతరగతి, బడుగు, బలహీనవర్గాలకు చెందిన వ్యక్తులు అధికంగా ఉన్నారు. వీరి ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న వడ్డీ వ్యాపారులు, డైలీ, వీక్లీ, మంత్లీ పద్ధతుల్లో 100 కి రూ.10 నుంచి 45 వరకు వసూలు చేస్తూ ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. చివరకు మహిళలను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసే స్థితికి వచ్చారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలపై బాధిత మహిళల ఆవేదనను...అప్పు తీర్చేందుకు వ్యభిచారం చేయమంటున్నారంటూ మీడియా వెలుగులోకి తెచ్చినా పోలీసులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐ, సిబ్బంది

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల పంచాయతీ పర్వతయ్యగారిపల్లికి చెందిన పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి (70) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం సుబ్బారెడ్డి ఊరి బయట రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన సొంత మామిడి తోటలోకి వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధువులు తోట వద్దకు వెళ్లి చూడగా మోటార్ స్టార్టర్ వద్ద రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నాడు. వారు మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. బుధవారం విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి, రూరల్ సీఐ వరప్రసాద్‌లు తమ సిబ్బందితో వెళ్లి సుబ్బారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. పలు అనుమానాలు వ్యక్తం కావడంతో సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులను విచారించారు. విద్యుత్ తీగలు తగులుకొని మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తల, కాళ్లకు గాయాలు ఉండటంతో స్థానికులు కొందరు సుబ్బారెడ్డి మృతి పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో రూరల్ సీఐ వరప్రసాద్ సిబ్బందితో మామిడి తోటలోకి వెళ్లి పరిశీలించారు. సుబ్బారెడ్డి దుస్తులు, పాదరక్షలకు ఉన్న రక్తపు మరకలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

8 తులాల బంగారం, రూ.30 వేలు చోరీ



నరసింహులు ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్ టీం

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలో రోడ్డు నంబర్ 10వ వీధిలో గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి ఓ ఇంటిలో 8 తులాల బంగారు, రూ. 30 వేల నగదును చోరీ చేశారు. బాధితుడు మోదుగుల నరసింహులు వివరాల మేరకు.. మాధవరం–1 గ్రామంలో ఉన్న తన తండ్రి నరసింహులు(68) ఆదివారం ఉదయం మృతి చెందాడన్నారు. తన తండ్రి మృతదేహాన్ని తన భార్య లక్ష్మిప్రసన్న పొత్తప్పి గ్రామానికి తీసుకెళ్లిందన్నారు. తండ్రి మరణ వార్త తెలుసుకుని తాను కువైట్ నుంచి సోమవారం పొత్తపికి వచ్చానన్నారు. అంత్యక్రియల అనంతరం బుధవారం మాధవరం –1 గ్రామానికి వచ్చామన్నారు. తమ ఇంటి తాళాలు పగులగొట్టి, లోపల ఉన్న బీరువాను తెరిచి దుస్తులను చిందర వందరగా పడేసి ఉండటాన్ని గమనించామన్నారు. ఇంట్లో ఉన్న 8 తులాల బంగారు, రూ. 30వేల నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను అపహరించుకొని వెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కడప నుంచి క్లూస్ టీంను రప్పించి దర్యాప్తు చేస్తున్నారు.

సీవీ పల్లెలో సమగ్ర విచారణ !

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు పంచాయతీ చిన్న వెంకట్రమణగారిపల్లి (సీవీ పల్లి) గ్రామాన్ని బుధవారం ఎస్ఐ హరిహర ప్రసాద్ సందర్శించారు. ఓ టీడీపీ సానుభూతిపరుడి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని పచ్చ పత్రికల్లో వెలువడిన కథనాన్ని గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు. దాయాదుల మధ్య నెలకొన్న దారి సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజకీయం చేస్తూ కొందరు టీడీపీ నాయకులు ప్రశాంతంగా ఉన్న పల్లెలో చిచ్చు రేపుతున్నారని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలపై ఎస్ఐ విచారణ చేపట్టారు. ముందుగా దారికి ఎవరు ఆటంకం కలిగించారు.. గతంలో పోలీసులకు వచ్చిన ఫిర్యాదులు, దాయాదుల మధ్య నెలకొన్న భూ సమస్యనా, రాజకీయంగా చోటు చేసుకున్న పరిణామాలా, ఇతర కారణాలా అని ఎస్ఐ క్షుణ్ణంగా ఆరా తీసినట్లు సమాచారం. విచారణ అనంతరం ఈ ఘటన సివిల్ పరిధిలోకి వస్తుందని శాశ్వత పరిష్కారం కోసం సమగ్రమైన వివరాలను తాము రెవెన్యూ అధికారులకు సిఫారసు చేస్తామని పోలీసులు వెల్లడించినట్లు గ్రామస్తులు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎవరైనా దారిలో ప్రజలకు ఆటంకం కలిగేలా వ్యవహరిస్తే సహించేది లేదని ఎస్ఐ హెచ్చరించినట్లు సమాచారం.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన మన్నేరు లత

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం కుమ్మరపల్లి పంచాయతీ మన్నేరువాండ్లపల్లెకు చెందిన మన్నేరు లత(38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మన్నేరువాండ్లపల్లెకు చెందిన వితంతువు మన్నేరు లతను అదే గ్రామానికి చెందిన ఏనుగుల శివ అనే వ్యక్తి గత కొంతకాలంగా తనను ప్రేమించాలని లేకపోతే తాను చనిపోతానని వేధిస్తున్నాడు. ఈ విషయం ఆమె కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి



వినేష్ (ఫైల్)

కలికిరి : వాల్మీకిపురం మండల పరిధిలోని గండబోయనపల్లి సమీపం టోల్ గేటు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు వినేష్(27) తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కలికిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎల్లయ్య కుమారుడు వినేష్ ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు ప్రముఖులు సర్పంచ్‌ను పరామర్శించారు. మృతదేహాన్ని బుధవారం సాయంత్రం స్వగ్రామం అంకెంవారిపల్లికి తరలించారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా మృతునికి భార్య, రెండు నెలల కుమారుడు ఉన్నాడు.

పీఎం సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి



పీఎంఎస్‌వై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ జానకీరామ్

రాయచోటి : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ జానకీరామ్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని సాయి శుభ కళ్యాణ మండపంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, ఉద్యోగులు, కార్మికులతో ముఖాముఖి నిర్వహించి సెక్షన్ల వారిగా పథకంపై సమీక్ష చేపట్టారు. మండల అధికారులకు ఆ సెక్షన్‌లో పనిచేసే సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. సూర్యఘర్ యోజనకు సంబంధించిన కాంట్రాక్టర్లతో కూడా సమావేశం నిర్వహించారు. ఈ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.78వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం వలన కరెంటు బిల్లును ఆదా చేయడమే కాకుండా పర్యావరణానికి మేలు చేయవచ్చన్నారు. ఒకసారి పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్ అమర్చుకోవడం ద్వారా 25 సంవత్సరాలపాటు సున్నా కరెంటు బిల్లుతో సంతోషంగా జీవించవచ్చన్నారు. ఈ పథకానికి బ్యాంకు ఏడుశాతం వడ్డీతో 90 శాతం రుణం ఇస్తుందన్నారు. సోలార్ ప్లాంట్ అమర్చేవారికి ఒక కిలోవాట్స్ రూ.30వేలు, రెండు కిలో వాట్స్‌ను రూ.60వేలు, మూడు కిలో వాట్స్‌కు రూ. 78 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. సోలార్ ప్లాంట్ అమర్చుకునే బీసీ వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 20 వేలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, విద్యుత్ శాఖ రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చాంద్‌బాషా, విజయ్ కుమార్ రెడ్డి, నాగముని స్వామి, అధికారులు, సిబ్బంది, వినియోగదారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

– ములకలచెరువు వాసి మృతి



రమణ (ఫైల్)

ములకలచెరువు : మహారాష్ట్రలోని పూణే సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ములకలచెరువు వాసి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ములకలచెరువు వినాయక్ నగర్‌లో ఉంటున్న పి.రమణకు నర్సరీ ఎరువుల ఫ్యాక్టరీ ఉంది. దీంతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో వెజిటబుల్ నర్సరీలు ఉన్నాయి. నర్సరీ పనుల మీద పి.రమణ తన సొంత బొలేరో వాహనంలో ఒంటరిగా మంగళవారం మహారాష్ట్రలోని గురిహత్నూర్ వెళ్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో పి.రమణ(45) తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. అక్కడి పోలీసులు కుటుంబ సభ్యులకు సమచారం అందించి, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బుధవారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ములకలచెరువు పోలీసులు వెల్లడించారు.

9 నుంచి అంగన్‌వాడీల సమ్మె బాట



స్త్రీ శిశు సంక్షేమశాఖ సూపరింటెండెంట్‌కు నోటీసులు అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : ఈనెల 9వ తేదీ నుంచి అంగన్‌వాడీలు సార్వత్రిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా కార్యదర్శి నాగేశ్వరి జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ సూపరింటెండెంట్ లక్ష్మిదేవికి నోటీసులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా కనీస వేతనాలు, ఈఎస్ఐ, పెన్షన్, గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు లేకుండానే అంగన్‌వాడీలు పని చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు యాప్‌ల పేరుతో పని భారం పెంచుతున్నారన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణుక, శశికళ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసులో పోలీసుల నిర్లక్ష్యం

ఒంటిమిట్ట : మండలంలోని మల్లేశ్వరపురానికి చెందిన అలిశెట్టి లక్ష్మీదేవి మృతిపై ఒంటిమిట్ట పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసుకు సంబంధించి ఒంటిమిట్ట పోలీసులు విచారణలో నిర్లక్ష్యం చూపుతున్నారని మృతురాలి చిన్న కూతురు శిరీషా ఆవేదన వ్యక్తం చేశారు. శిరీషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన తల్లి మరణానికి కారణమైన వారిని కనీసం స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూడా పిలిపించి విచారించకుండా నిందితులను పోలీసు బందోబస్తుతో ఊరు దాటించారని ఆరోపించారు. కోళ్లమీద సాకుతో తమ దాయాదులైన అలిశెట్టి సుశీల, అలిశెట్టి భవానీ, అలిశెట్టి ధరణి, శేఖర్, హరి, పెంచలమ్మ అనే ఏడుగురు తమ తల్లిపై జూన్ 14వ తేదీన దాడి చేశారన్నారు. తాము ఫిర్యాదు చేస్తే రాజీకి రావాలని, డబ్బు ఇప్పిస్తామని లేకుంటే తమపైనే కేసులు పెడతామని ఒంటిమిట్ట పోలీసులు బెదిరించారన్నారు. చివరకు జూన్ 28న రిమ్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసిన మరుసటి రోజు జూన్ 29న అలిశెట్టి లక్ష్మీదేవి తీవ్ర అనారోగ్యంతో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందిందన్నారు. లక్ష్మీదేవి శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ అయి చనిపోయిందని వైద్యులు తెలిపారన్నారు. దీంతో ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌లో అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారన్నారు. ఈ కేసులో నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆమె ఆరోపించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఒంటిమిట్ట : మండలంలోని కొత్తమాధవరం గ్రామం అంకాలమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న చొప్పా జానకీ ప్రసన్న (21)ను వరకట్నం కోసం వేధిస్తున్నారని బుధవారం ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. చొప్పా జానకీ ప్రసన్నకు ఏడు నెలల క్రితం చొప్పా సురేష్ అనే వ్యక్తితో ప్రేమ వివాహమైంది. మూడు నెలల నుంచి రూ. 5 లక్షలు కట్నం తీసుకురావాలని తన భర్త సురేష్, అత్త లక్షుమ్మ, మామ వెంకట సుబ్బయ్య, ఆడబిడ్డ మౌనిక వేధిస్తున్నారని తెలిపారు. ఈ వేధింపులు తాళలేక ఆమె నిద్రమాత్రలు మింగడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని బుధవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కనగంటి విజయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణ గావించి గర్భాలయంలో ఉన్న మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాళ్లే దాడి చేసి.. వాళ్లే కేసు పెట్టారు

వైఎస్సార్‌ సీపీ దళిత కౌన్సిలర్‌పై తప్పుడు కేసు



టూటౌన్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన కౌన్సిలర్ ప్రసాద్‌బాబుతో మాట్లాడుతున్న సీఐ రామచంద్ర

మదనపల్లె రూరల్ : టీడీపీ నేతల ఒత్తిడితో దాడికి గురైన వైఎస్సార్‌సీపీ దళిత కౌన్సిలర్‌పైనే తప్పుడు కేసు నమోదుచేసి, ఆపై స్టేషన్ వద్ద ధర్నా తర్వాత దాడి చేసిన వ్యక్తిపై కౌంటర్ కేసు నమోదు చేసిన ఘటన ఇది. అన్నమయ్య జిల్లా, మదనపల్లె రూరల్ మండలం, గొల్లపల్లెలోని ఆర్.కే. పార్కింగ్ వద్ద చోటుచేసుకున్న ఈ ఘటనపై 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం, రెండు రోజుల క్రితం ఆర్.కే.పార్కింగ్‌లో నిలిపిన కారును తీసుకుని ప్రసాద్‌బాబు వెలుపలికి వస్తుండగా, సుధాకరనాయుడు తన వోక్స్ వ్యాగన్ కారును అడ్డంగా నిలిపాడు. కారును వెనక్కు తీసుకోవలసిందని కోరిన ప్రసాద్‌బాబును నోటికి వచ్చినట్లు దుర్భాషలాడటమే కాకుండా ఆయనపై దాడిచేసేందుకు పెద్ద బండరాయిని తీసుకుని తరిమాడు. దీంతో ప్రసాద్‌బాబు, తన అనుచరులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆయనకు మద్దతుగా అక్కడకు చేరుకున్నారు. తర్వాత ఇరువురిని చుట్టుపక్కల వారు శాంతింపజేసి అక్కడ నుంచి పంపేశారు. అయితే జరిగిన ఘటనను రాజకీయంగా వాడుకోవాలనే దురుద్దేశంతో టీడీపీ మహిళా నాయకురాలు నాగమణి, తన పరపతిని ఉపయోగించి ప్రసాద్‌బాబుపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించింది. దీంతో పోలీసులు ప్రసాద్‌బాబుకు విషయం తెలపడంతో ఆయన సుధాకరనాయుడు తనపై రాయితో దాడికి పాల్పడిన ఈ ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా పుటేజీలను తీసుకుని స్టేషన్‌కు వెళ్లాడు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన ప్రసాద్‌బాబు తనపై జరిగిన దాడికి సుధాకరనాయుడు, తనను ఫోన్‌లో దుర్భాషలాడిన నాగమణిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశాడు. తన అనుచరులతో స్టేషన్ ఎదుట ధర్నాకు దిగాడు. ఎట్టకేలకు పోలీసులు సుధాకరనాయుడుపై కేసు కట్టడంతో ధర్నా విరమించారు.

భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంటు



మేస్త్రీలకు బహుమతులను అందజేసిన భారతి సిమెంటు ప్రతినిధులు

రాజంపేట : అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలకు భారతి సిమెంటు పటిష్టమైనదని భారతి సిమెంటు టెక్నికల్ ఇంజినీర్ ఎస్. శ్రీకాంత్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్ సమీపంలోని మేస్త్రీలకు సిమెంటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భారతి సిమెంటు ప్రతినిధులు మాట్లాడుతూ భారతి సిమెంటు రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. ఇతర కంపెనీల సిమెంటు ఐదు గంటల్లో సెట్ అయితే, భారతి అల్ట్రా ఫాస్టు రెండు గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. అనంతరం 50 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్, బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంటు డీలర్ రవి, మేస్త్రీలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడికి తీవ్ర గాయాలు



విద్యుత్‌షాక్‌కు గురై పోల్ మీద వేలాడుతున్న కార్మికుడు వెంకటరమణ

మదనపల్లె రూరల్ : విద్యుత్ పోల్ మరమ్మతులకు వెళ్లిన కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా మారిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. బుధవారం ఉదయం ఎన్టీఆర్ సర్కిల్‌లోని విద్యుత్ పోల్‌ను టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో స్తంభం పూర్తిగా పక్కకు ఒరిగిపోయింది. దీంతో మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌శాఖ అధికారులు, కాంట్రాక్టర్ రిటైర్డ్ విద్యుత్‌శాఖ ఏడీ నరసింహకు బాధ్యతలు అప్పగించారు. ఆయన తన వద్ద పనిచేసే నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ ఉంటావారిపల్లెకు చెందిన రామప్ప కుమారుడు వెంకటరమణ(35)కు పనులు పురమాయించారు. దీంతో వెంకటరమణ విద్యుత్ పోల్ మరమ్మతుల కోసం పైకి ఎక్కి పనిచేస్తుండగా, ఆపైన ఉన్న విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురయ్యాడు. కింద పడే క్రమంలో మధ్యలో ఉన్న వైర్లపై పడి వేలాడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న విద్యుత్ సిబ్బంది, సరఫరా నిలిపివేసి, స్థానికుల సహాయంతో గాయపడిన వ్యక్తిని కిందకు దించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే, ఈ ఘటనలో విద్యుత్‌శాఖ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పోల్ మరమ్మతులు చేసే సమయంలో విద్యుత్ సరఫరా లేకుండా చూడటంతో పాటు లైన్‌మెన్ పర్యవేక్షణలో చేయాల్సిన పనులను ఎవరూ లేకుండా నిర్వహించడంపై బాధితుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాలతో పడి ఉన్న బాధితుడిని కిందకు దించి ప్రభుత్వ ఆస్పత్రికి పంపి చేతులు దులుపుకున్నారన్నారు. బాధితుడి పరిస్థితిపై చలించిన బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే సమాధానం రాలేదు.